క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ధర్పల్లి: మండలంలోని హొన్నాజిపేట్ జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలకు చెందిన డి వర్ష, ఎం అంజన రాష్ట్రస్థాయి ఆంగ్ల ఉపన్యాస పోటీలకు ఎంపికయ్యారు. వర్ష జిల్లా కేంద్రంలో ఎల్బా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆంగ్ల ఉపన్యాస పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొంది రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఆంగ్ల ఉపన్యాస పోటీలకు ఎంపికయ్యారు. అలాగే అంజన ఆంగ్ల ఒలంపియాడ్ టెస్టులో ద్వితీయ స్థానంలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అధికారులు అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ఎంపికకు కృషి పాఠశాల ఉపాధ్యాయులకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, వీడీసీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

నిజామాబాద్ సిటీ: దేశంలో మహిళలపై జరుగుతున్న అణచివేతలను పౌర సమాజం తిప్పికొట్టాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు అరుణ అన్నారు. బుధవారం నగరంలోని కోటగల్లిలో ఉన్న ఎన్ఆర్ భవన్‌లో ఐక్యత సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపైన రోజురోజుకు జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, అణిచివేతలు, లైంగిక అత్యాచారాలకు వ్యతిరేకంగా పీవోడబ్ల్యూ పోరాటాలు కొనసాగిస్తోందని మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 24న మంచిర్యాలలో నిర్వహించే రాష్ట్ర కమిటీల ఐక్యత సభలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, సంజన, రేఖ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఇందల్వాయి: ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఎంటమాలజీ పరిశీలకులు శ్రీనివాసులు, టెక్నీషియన్ హరిదాత్ బుధవారం పరిశీలించారు. కీటక జనిత వ్యాధులైన డెంగీ వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. డెంగీ కేసులు అధికంగా నమోదైన గ్రామాల్లో సర్వే నిర్వహించారు. విరివిగా రక్త పరీక్షలు నిర్వహించాలని, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు. వారి వెంట స్థానిక వైద్యాధికారి సుశాంత్ రెడ్డి, హెచ్ఈవో శంకర్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఇందల్వాయి: ప్రమాదంలో గాయపడి చికిత్స చేయించుకున్న నల్లవెల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త రాకేశ్‌రెడ్డికి ఎంపీ అర్వింద్ ఫౌండేషన్ ద్వారా మంజూరైన రూ. 50 వేల ఆర్థికసాయాన్ని రూరల్ కన్వీనర్ పద్మారావు చెక్కు రూపంలో బుధవారం అందజేశారు. ఆపదలో ఉన్న ఐదుగురు గ్రామ బీజేపీ కార్యకర్తలకు ఇప్పటి వరకు ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందడంపై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మండల ఉపాధ్యక్షుడు కన్నె చిన్ను తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ధర్పల్లి: మండలంలోని రామడుగులో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



సిరికొండ: మండల కేంద్రం నుంచి చీమన్‌పల్లి వెళ్లే మార్గంలో మూలమలుపుల వద్ద పెరిగిన ముళ్ల పొదలను ఎస్సై ఎల్‌రామ్ బుధవారం తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఈ మార్గంలో మూలమలుపు లు ప్రమాదకరంగా ఉన్నాయని వాటికి తోడు పిచ్చి మొక్కలు ముళ్లపొదలు పెరిగిపోయి ఏర్పడకుండా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ముళ్ల పొదలను తొలగింప జేసినట్లు తెలిపారు.



43వ డివిజన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ దిలీప్



41వ డివిజన్‌లో పాల్గొన్న కాలనీవాసులు



24వ డివిజన్‌లో పాల్గొన్న మేయర్ నీతూకిరణ్



సిరికొండలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

నిలదీతలు.. నిరసనలు



నారాయణ్‌పేట్‌లో మాట్లాడుతున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయారెడ్డి



పడకల్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



రాంనగర్‌లో మాట్లాడుతున్న అధికారులు

- రెండో రోజు కొనసాగిన వార్డు, గ్రామ సభలు
- పలుచోట్ల అనర్హుల పేర్లు వచ్చాయంటూ నిరసన
- పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చిన పోలీసులు
- పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్న అధికారులు

నిజామాబాద్ సిటీ/ సిరికొండ/ జక్రాన్‌పల్లి/ డిచ్‌పల్లి/ ధర్పల్లి/ నిజామాబాద్ రూరల్/ మోపాల్: నాలుగు పథకాల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న వార్డు, గ్రామసభలు నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో నిలదీతలు, నిరసనల మధ్య కొనసాగాయి. బుధవారం నగరంలోని 16 డివిజన్‌లో మున్సిపల్ అధికారులు సమావేశాలు నిర్వహించారు. 8, 13, 14, 18, 19, 24, 25, 32, 35, 36,43, 44, 46, 51, 52, 54 డివిజన్లలో సభలు జరిగాయి. 24, 41 డివిజన్‌లలో అధికారులను స్థానికులు నిలదీశారు. అనర్హులను ఎంపిక చేశారని మండిపడ్డారు. 8వ డివిజన్‌లో సభను మేయర్ దండు నీతూకిరణ్ పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 43 డివిజన్‌లో కార్పొరేటర్ విశాలిని రెడ్డి పేరు ఎలా చేర్చారని బీజేపీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ స్రవంతి రెడ్డి అభ్యంతరం తెలిపి అధికారులను నిలదీశారు. 13వ డివిజన్‌లోని సారంగాపూర్‌లో వార్డు సమావేశం నిర్వహించకపోవడం, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జాబితా చదవకపోవడంతో స్థానిక నాయకులు అభ్యంతరం తెలిపి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. 43వ డివిజన్‌లో జరిగిన గ్రామసభలో కమిషనర్ ఎస్.దిలీప్‌కుమార్ పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడారు. 24, 25 డివిజన్‌లలో డిప్యూటీ కమిషర్ రాజేంద్రకుమార్, 42వ డివిజన్‌లో అడిషనల్ కమిషనర్ ఎస్.శంకర్ పరిశీలించారు. గురువారం నగరంలోని 11, 12, 22,23, 33, 37, 38, 39, 45, 48, 53, 55, 56, 57 డివిజన్‌లలో గ్రామసభలు నిర్వహించనున్నారు. సిరికొండ మండల కేంద్రంతో పాటు న్యావనంది చీమనపల్లి, తాటిపల్లి, తూంపల్లి, హుస్సేన్‌నగర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. పడకల్‌లో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్‌లో అనర్హులను ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు ఎంపిక చేశారని గ్రామస్తులు నిలదీశారు. అర్హుల జాబితాలో తమ పేర్లు లేకపోవడంపై పడకల్‌లో గ్రామస్తులు నిరసన తెలిపారు. లక్ష్మాపూర్‌లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయారెడ్డి మాట్లాడుతూ అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి, డిచ్‌పల్లి తండా, సుద్దపల్లి, దేవుపల్లి క్యాంప్, మెంట్రాజ్‌పల్లి, నాకా తండా, యానంపల్లి, యానంపల్లి తండా, సాంపల్లి, సాంపల్లి తండాలో గ్రామసభలు నిర్వహించారు. జాబితాలో పేర్లు లేని వారు అధికారులపై వాగ్వాదానికి దిగారు. ధర్పల్లి మండలంలోని చల్లగర్గ, మైలారంలో నిర్వహించిన గ్రామసభలో ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ ఎంపీడీవో బాలకృష్ణతో కలిసి పాల్గొన్నారు. మోపాల్ మండలంలోని మోపాల్, బాడ్సి, మంచిప్ప, అమ్రాబాద్, ఎల్లమ్మకుంట గ్రామాల్లో గ్రామసభలు కొనసాగాయి. మంచిప్పలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమ పేర్లు లేవని ప్రజలు ఒక్కసారిగా వేదికవైపు దూసుకవచ్చారు. ఎస్సై యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వారిని అదుపుచేశారు.



చల్లగర్గ సభలో



సుద్దపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



శాస్త్రినగర్‌లో..



మోపాల్‌లో ..



మంచిప్పలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న దయానంద్

నిజామాబాద్ రూరల్: నగరంలోని సరస్వతినగర్‌లో ఉన్న శబ్ద తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విశ్రాంత ఆచార్యులు సేర్ల దయానంద్ మాట్లాడుతూ.. జైహింద్ నినాదంతో భారతీయుల్లో దేశభక్తిని పెంపొందించిన మహనీయుడని కొనియాడారు. స్వాతంత్ర్య సమరంలో అగ్రగణ్యుడు, అలుపెరుగని పోరాట యోధుడు సుభాష్‌చంద్రబోస్ అని అన్నారు. డాక్టర్ గురువారెడ్డి మాట్లాడుతూ.. ఆజాద్ హింద్ ఫౌజ్ అనే మిలిటరీ సంస్థను స్థాపించి పోరాటం ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టిన మహనీయుడని అన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్‌గౌడ్, తొగర్ల సురేశ్, ప్రవీణ్‌కుమార్, ఆడెపు లింబాద్రి, బాబురావు, విఠం దయానంద్, భాస్కర్, శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్జి సునీత కుంచాల



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ నాగారం: స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్స్ వారు రూపొందించిన నూతన క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వేర్వేరుగా ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి పద్మావతి, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, దివ్యాంగ బాలలు ఉన్నారు.

సంక్షిప్తం

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్



ధర్పల్లి: ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు నడవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో దళితవాడలో ర్యాలీ నిర్వహించి, వారితో మమేకమై రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, కర్క గంగారెడ్డి, పెంటన్న, మహేశ్, రాజశేఖర్, అశోక్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతోనే వ్యాధులు



నిజామాబాద్ రూరల్: జీవనశైలిలో మార్పులతోనే డయాబెటిస్, హైపర్‌టెన్షన్ ఇతర వ్యాధులు వస్తున్నాయని గీత భవనం అధ్యక్షుడు ఎంఎస్ నరసింహచార్యులు అన్నారు. బుధవారం అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి నిజామాబాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవలో భాగంగా 32 మందికి రక్తపరీక్షలు చేశారు. షుగర్ వస్తే తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేడిచర్ల ప్రభాకర్‌రావు, ఆరెట్టి లక్ష్మీనారాయణ, జీఎం శంకర్, వెంకటస్వామి, వినోద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జాంబోరికి ప్రత్యేక శిక్షణ



సిరికొండ: స్కౌట్స్ గైడ్స్ జాతీయ జంబోరిలో పాల్గొనడానికి సిరికొండ సత్యశోధక్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరంలో భాగంగా వివిధ రకాల క్యాంపు క్రాఫ్ట్‌కు సంబంధించి తయారు చేసిన వాటిని బుధవారం ప్రదర్శించారు. స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి సాల్మన్ విద్యార్థులు ప్రదర్శించిన అంశాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, గైడ్ కెప్టెన్ వనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవజన్మ ఎంతో విలువైనది



నిజామాబాద్ రూరల్: మానవ జన్మ ఎంతో విలువైనదని ప్రముఖ పండితులు బ్రహ్మశ్రీ మేథరాజ్ శర్మ అన్నారు. బస్వాగార్డెన్‌లో కొనసాగుతున్న శ్రీ శివ మహాపురాణ ప్రవచనం మూడో రోజు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ జన్మను సార్థకం చేసుకోవాలంటే ఆధ్యాత్మిక చింతన తప్ప వేరే మార్గం లేదన్నారు. శివపురాణ ప్రవచన కార్యక్రమం ఏడు రోజుల పాటు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల కిసాన్ కేత్ అధ్యక్షుడు బోయి బాలయ్య తల్లి ఇటీవల మృతి చెందిందింది. దీంతో బాలయ్యను సీపీఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ బుధవారం పరామర్శించారు. నాయకులు ముత్తెన్న, రొడ్డ సాయన్న, రొడ్డ రవి తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

సుభాష్ నగర్: బీజేపీ కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటానని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి అన్నారు. నిజామాబాద్‌లోని తన కార్యాలయంలో బుధవారం పార్టీ బూత్‌స్థాయి కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా పార్లమెంట్ పరిధిలోని 33 మంది బూత్ స్థాయి కార్యకర్తలకు రూ.13.65 లక్షల చెక్కులను అసెంబ్లీ కన్వీనర్లు, మండలాల అధ్యక్షులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన ఫౌండేషన్ ద్వారా కార్యకర్తలకు తగిన సహాయం చేస్తానన్నారు. కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈసందర్భంగా పలువురు కార్యకర్తలు ఎంపీకి ధన్యవాదాలు తెలియజేశారు. అసెంబ్లీ కన్వీనర్లు, మండలాల అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, ఎంపీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

26న ప్రతిభా పురస్కారాలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని తెలుగు వెలుగు సమాఖ్య సంస్థ స్థాపించి 45 ఏళ్లు పూర్తయినందున ఈ నెల 26న శివాజీనగర్‌లోని రామకృష్ణ విద్యాలయం ఉన్నత పాఠశాలలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి బి చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజానికి సేవలందిస్తున్న డాక్టర్లు, టైలర్లు, ఫొటోగ్రాఫర్లు, సాహితీ వేత్తలు, బుర్రకథ, మిమిక్రీ తదితర రంగాల్లో 30 మంది కళాకారులను ఎంపిక చేసి సన్మానించి పురస్కారాలు అందజేస్తామని తెలిపారు.

'ఉద్యమకారులకు స్థలం ఇస్తామన్నారు'



నిజామాబాద్ అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలంతో పాటు పెన్షన్ కూడా ఇస్తామని పేర్కొనడం జరిగిందని మాజీ కార్పొరేటర్ విశాలిరెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగానే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం తెలుపడంతో తాను దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కానీ ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరిగినప్పుడు సర్వే సిబ్బంది ఇంటికి వచ్చి వివరాలు సేకరించగా తనకు ఇందిరమ్మ ఇల్లు వద్దు అని పేర్కొనడం జరిగిందన్నారు. కానీ అర్హుల జాబితాలో ఇల్లు మంజూరైనట్లు రావడం జరిగిందని అన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రుద్రూర్: సీపీఎం పార్టీ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ప్రజలను కోరారు. మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు.

గంగాధర్‌కు సన్మానం



సుభాష్‌నగర్: విద్యుత్ కార్మిక సంఘం 320/యూనియన్(ఐఎన్‌టీయూసీ) టీజీఎన్‌పీడీసీఎల్ కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన పూదరి గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో వీరు విజయం సాధించిన విషయం తెలిసిందే. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి వచ్చిన కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం నుంచి నూతన మీటింగ్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్నానని గంగాధర్ పేర్కొన్నారు. వేణుగోపాల్‌రావు, వై సంపత్‌రెడ్డి, మెహర్‌బాబా, మనోహర్, పెంటయ్య, సుధాకర్, రామ్మోహన్, అంజయ్య, మోహినొద్దీన్, కార్తీక్, మోహన్, రాజేంద్రప్రసాద్, గంగాధర్, చందర్, నాంపల్లి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ



మాట్లాడుతున్న జయికుమార్

నిజామాబాద్‌నాగారం: భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకుడు రాంచంద్రయాదవ్ ఆదేశాల మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి జయికుమార్ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరఫున అభ్యర్థులను నియమించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్‌టీఐ అధ్యక్షుడు బాలరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్ రూరల్: విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవలని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. నగరంలోని గంగాస్థాన్ ఫేస్-2లో ఉన్న యూవీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యూవీ కాలేజ్ హోటల్ మేనేజ్‌మెంట్ మంచి కోర్సులు అందిస్తోందని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సృజన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,609	వెండి(కిలో)	95,800
22 క్యారెట్స్	75,295	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	40	60
బెండకాయ	50	90	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	50	90	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	20	40	కరివేపాకు	60	100
మెంతికూర	20	40	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	80
క్యాప్సికం	40	60			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.45,4.30,7.25, 10.20
స్క్రీన్-2	గేమ్‌ఛేంజర్ -1.10,7.35 10.35 డాకు మహారాజు(తెలుగు)-4.30
స్క్రీన్-3	డాకుమహారాజు(తెలుగు)-11.00, 7.35,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.10, 1.10, 4.10, 7.10, 10.10
స్క్రీన్-2	డాకు మహారాజు (తెలుగు)- 10.20, 1.25, 7.35, 10.40 ఎమర్జెన్సీ(హిందీ)-4.30
స్క్రీన్-3	గేమ్ ఛేంజర్(తెలుగు)- 12.00, 3.20, 6.40 ఎమర్జెన్సీ(హిందీ)-10.00
స్క్రీన్ -4	ఎమర్జెన్సీ(హిందీ)-12.00 ఆజాద్(హిందీ)-3.05, 10.15 పుష్ప-02(తెలుగు)-6.10
లలితామహల్	గేమ్ ఛేంజర్(తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)